# లక్ష్మి ఉపాసకుడు

"ఏమిట్రా రాను రాను యిట్లా పీనుగువై పోతున్నావ్?" అని స్నేహితులు, చనువున్న వాళ్లు అతన్ని తేరిపార జూశారు.

"ఒకప్పుడు మనం పెద్ద శాండోలమా ఏమిట్రా? అని సమాధానం చెప్పీ, చెప్పకుండానే అతను దారి తీసేవాడు.

"నాయనా – ఏమిటిట్లా ప్రాణం కళ్ళల్లో పెట్టుకు తిరుగుతున్నావ్. ఇంత మెతుకు తింటంలేదు. ఎవరైనా డాక్టర్‌కు చూపించుకో నాయనా" అని తల్లి బ్రతిమలాడింది.

"నాకే జబ్బూ లేదమ్మా. మీ కంటె నేనేం తక్కువ తింటం లేదు. తిన్నదేదో హరాయించుకొంటున్నాను. ఇప్పుడు డాక్టర్లంటే మాటలు గాదు. పాతిక రూపాయలుంటే గాని వాళ్ళ గడప తొక్కేందుకు లేదు." అని అతికీ అతకని సమాధానం యిచ్చాడు తల్లికి. కన్న

నాటినుంచి తనకనురెప్పను ఎరిగినట్లు కొడుకు నెరిగిన తల్లి ఆమె. ఏదో పరధ్యానంతో వెళ్ళి పోతుంటే కొత్తగా అతన్ని ఎగాదిగా చూసింది. తండ్రి! తండ్రి!! తండ్రి!!!

అతని జబ్బేమో ఆమె కర్థమయింది. తన కొడుకుది డబ్బు జబ్బు. ధన జాడ్యం. కొడుకు చిన్న తనమంతా, తనకు వైధవ్యం రాకముందు ఆ యింటి శోభంతా ఆమె కళ్ళముందు లీలగా నిలిచింది. తన బిడ్డ అంతరాంతరాలన్నీ ఆమెకు తెలుసు. భయంతో అతనిని ఆవహించిన అశాంతిని తలచు కొన్నది. కన్నీళ్ళు పెట్టుకొన్నది. కాని అతడినిక ప్రశ్నించలేక పోయింది.

భార్యతో మాట్లాండేందుకే తీరిక చిక్కటం లేదు. దయ్యం వెనకనుంచి తరుము తున్నట్లు పరుగెత్తి పోతున్నాడు. భార్య పట్టు దలగా, జాగరణ చేసినట్లు రాత్రిలో రాక్షసుల వేళదాకా అతనిని బ్రతిమ లాడుదామని, మందలిద్దామని, రక్షించుకొందామని, ఆ అశాంతి రహస్య మేమిటో తెలుసుకొందామని కనిపెట్టుకు కూచునేది. కాని ఆ సంగతి ముందే కనిపెట్టినట్టు ఆ రోజుఅతని రాక మరింత ఆలస్య మయేది. అలసటలో, ఆవలింతల్లో ఆమె నోరు మెదల్పటానికి సందు దొరికేది కాదు — ఆతర్వాత.

ఒక రోజున గది వాకిలి కడ్డంగా పడుకొని, అతను దాటి పోతుంటే కాళ్ళు గట్టిగా పట్టుకుని ఏడుపు లంకించుకుంది. "నన్నిందు కేనా చేసుకున్నది చెప్పండి. నన్నెందు కన్యాయం చేస్తారు?"

"ఏం అన్యాయం చేశాను?" అని దిగ్భ్రమతో అతను భార్యవంక చూశాడు.

"మిమ్మల్ని చూస్తే నా కెందుకో భయంగా వుంది!"

"ఎందుకు భయం?"

"మీకున్న జబ్బేదో దాచి పెడ్తున్నారు — మమ్మల్ని చూసైనా జాలి పడండి. ఒక్కగా నొక్క పిల్ల. మీ కన్న కడుపు దేవులించదూ?

రాత్రిళ్ళు దగ్గుతున్నారు."

"క్షయరోగం అనుకున్నావా ఏమిటే? నాకేరోగం లేదు. రాత్రిళ్ల నిద్ర తక్కువైంది. అంతే."

"కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోండి. నామాట విని సెలవు పెట్టండి."

"నాకా విశ్రాంతి? నా కిప్పట్లో విశ్రాంతి లేదు. అయినా ఎక్కడ తీసుకోను? మన యిల్లని చివరకు నిట్టాడి గుడిసె గుడా లేదు."

"మా యింటికి వెళ్దాం. మా వూరు వెళ్దాం. మా నాన్న రమ్మని రాస్తున్నారు ఎన్నాళ్ళ నుంచో."

"అవును, వెళ్తే మీ వూరే వెళ్లాలి. అందులో మీ నాన్న ఆతిధ్యం పొందాలి. మీ నాన్న మానాన్న ఎప్పటికీ కాడు. నా జబ్బే మిటో పోయి మా అమ్మ నడుగు చెబుతుంది."

అత్తా కోడళ్ళకు చాలా నెలలనుండి మాటలులేవు. అతని భార్య — బిడ్డను కౌగలించుకుని, ఏడుపు దిగ మింగుకొని ఆ రాత్రి అతని కాళ్ళ వద్దే పడుకొంది. అతను తెల్లవారు జామునే లేచి వెళ్ళిపోయాడు. అతన్నేదో దయ్యం తరుము తున్నది. భార్యకు అర్థం కాలేదు. పదివేల దేవుళ్ళకు మొక్కుకున్నది. డజను ముడుపులు చెల్లిస్తానన్నది. పెండ్లయి కాపరాని కొచ్చిన మొదటి మూడు దినాల్లోనే యీ సుందర తరమైన ఆత్మను అర్థం చేసుకొన్నా డనుకొన్న తన భర్తేనా యీతడు. జీవితానికి కొత్త అర్థంయిచ్చి తమ గదిలో గడిపిన ప్రతిమధురమైన క్షణానికి దేవ త్వాన్నిచ్చిన తన భర్తేనా యీతడు? నిండా పాతికేళ్ళు రాకనే ముసలి వాడవుతున్నాడు. ఏమిటీ పరుగు? ఏమిటీ వైరాగ్యం? ఏమిటీ నిరాశా ప్రకృతి? ఏ అనురాగవతి పాప బాహు వల్లరిలోనైనా చిక్కు కున్నాడా? తన బిడ్డను గూడా తిరస్కరించే హృదయ దారుఢ్యం మరెట్లా వస్తుంది. కోడలు కళ్ళ నీళ్ళు తిరిగినవి. హృదయం బెంబేలు పడిపోయింది.

"అత్తయ్యా!" అని పిలిచింది.

అప్పటికి వాళ్ళిద్దరూ మాట్లాడుకొని ఒక సంవత్సరమైనా గడిచి వుంటుంది. ఎవరికోసం యీర్ష్యపడి, ఎవరి మీద అంతర్, బాహ్య అధికారం కోసం యిద్దరూ శత్రువుల వలె చిరకాలం మౌనంగా తొలగి పోయారో అతడి మీద ప్రేమ, అవ్యాజాను రాగాలతోనే ఆ యిద్దరికీ చూపులు కలిసినవి. మాటలు దొర్లినవి.

"అత్తయ్యా?"

వయసు మళ్ళుతున్న ఆమె తన కోడలి కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళల్లో యీర్ష్య, కోపం, ఆడ సాధింపులకు బదులు అనురాగం, అర్థం, అవ్యక్తాందోళన, అశ్రుజలం నిండివున్నై. ఆ యిద్దరి కళ్ళు ఒకే భాష, ఒకే సారి మాట్లాడినవి. ఆయిద్దరికీ జీవనం జీవనాధారం, గతి, ముక్తీ, ఆత్మ – అతడి మూర్తి.

అత్త గద్గదంగా మాట్లాడింది.

* * *

"ఇది మా యింట్లో వున్న రోగమేనే పిల్లా, నీకు తెలియదు. మీ మామగారు యింతే".

ఆ పిల్ల గుండె కొట్టుకోవటం దాదాపు ఆగిపోయింది.

"మీ మామగారు నేను కాపరానికి వెళ్ళినప్పుడూ యింతే వరస. పెద్ద సంసారం. చాలీ చాలని సంపాదన.నా మీద ఆశలు పెట్టుకొన్న వాళ్ళ మిమ్మల్ని సుఖ పెట్టలేక పోతే నా బతుకెందుకు అని యిక నడుం బిగించారు. ఇక యిదే వరుసనుకో. రాత్రింబగళ్ళు యింటి పట్టున వుండేవారుగాదు. లక్ష పనులు తవ్వి నెత్తికెత్తుకున్నారు. ఎప్పుడూ అదే మాట. యింత సంపాదించి మిమ్మల్ని సుఖపెట్టలేక పోతేనే నెందుకు – అన్న స్మరణేస్మరణ. ఆయన తలపెట్టిన వేళా విశేషమో ఏమో పోయినవి పోగా మిగిలిన పనుల్లో వేలకు వేలు ఆర్జించారు. ఇక వూరుకోవచ్చుగా. ఊహూ! వూరుకుంటే ఎట్లా? కూచుని తింటే కొండలు గూడా కరిగిపోతైయని ఒకటే ఆవేదన పడిపోయేవారు. లక్ష్మి ఎట్లా నవ్వుతూ,

నాట్యం చేస్తూ, నీవేనంటూ వచ్చిందో, అట్లాగే తనకు కాదన్నట్లుగా తనకు పట్ట నట్టుగా, తను లేనన్నట్లుగా తనను కొలవ లేదన్నట్లుగా వెళ్ళి పోయింది. ఏముంది? ఎక్కడ బయలు దేరామో అక్కడికొచ్చాం. వీళ్ళ కుటుంబంలో ధనపిచ్చ జాస్తి, ఉన్న దాంట్లో తృప్తిపడే రకం గాదు."

"అయితే మీ కొడుక్కు—?"

"డబ్బు పిచ్చ. మనల్ని సుఖ పెట్టాలనే ఆవేదన, మీ మామగారి అవేదన."

"డబ్బు పిచ్చ. మనల్ని సుఖ పెట్టాలనే"

* * *

కోడలి హృదయ భారం కొంత తీరింది. భర్తను అర్ధం చేసు కొన్నా ననుకొన్న తన అర్థానికి, వేయి అపార్థాలూ, యింకో వేయి వుపార్థాలూ వున్నాయని గ్రహించింది. తనూ, తన భర్త వృద్ధులై పొలేదులే అని లోలోన సంతసించుకొంది తమ మీది అతడి శ్రద్ధకు వుప్పొంగి పోయింది. ఏమిటో ఒక వైరాగ్యం ఆవేశించింది. ఇన్నాళ్లూ, అత్తగారిమీద తన దురభిప్రాయాలూ, ఈసు, వూసు ఆ క్షణంలో మరిచిపోయింది. పిల్లకూ, తనకూ గుడ్డలు సరైనవి లేవని విసుగుకొన్న రోజులున్నవా అనుకొంది. తన మొగుడు కొనలేని వేడి నీళ్ల బాయిలర్ కోసం, చక్కని ముద్దు లొలికే రేడియోకోసం, ఇట్టే కాఫీ వేడి చేయగల కిరోసిన్ స్టవ్ కోసం, ఆ వీధిలోనే వున్న అరవ రైల్వే గుమాస్తా యింట్లో ముసలమ్మ చూపిన కాఫీ ఫిల్టరుకోసం—కలలు కని ఆ యన్నెందు కట్లా వేధించింది. కట్నం కింద వచ్చిన వెండి పళ్ళెన్ని తాకట్టు పెట్టిన్నప్పుడు, తల్లికి జబ్బు చేసిన నెలలో తన ఒంటి పేట గొలుసును దయా దాక్షిణ్యాలు లేకుండా అమ్మి వేసిన నెలలో భర్తతో మాట్లాడటమే మానుకొన్న పాపిగాదూ తను? అవును. ఆ పాపమంతా యీ పశ్చాత్తాపంతో పోతే, ఆనందం దుఃఖం కలిసి వచ్చి ఆమె శరీరం

వేడి కొలిమి అయింది. కళ్లు ఎర్రబడి ఆగని ధారగా దుఃఖజలం పొర్లి పొర్లి వస్తున్నది. తల్లి ఏడుస్తున్నదని ఏమీతెలీక పిల్లగూడా ఏడుస్తున్నది.

అ సమయంలో అతను వచ్చాడు.

"ఎందు కేడుస్తున్నావ్?"

ఆమె గడబిడ పడి "మీ తోడు, మీ పాదాల తోడు నే నేడవటం లేదు" అని ముద్దు ముద్దు మాటలుతో ఒట్టు బెట్టుకో బోయింది.

అతను భార్య పక్కనే కడవమీద కూలబడి ఎబ్బెట్టు పడి ఓదారుస్తూ అన్నాడు.

"ఇదుగో చూడు, సుందరం, నీ బాకీ అంతా తీరుస్తాను పైసల్తో సహా. నన్ను చేసుకున్నందుకూ యిన్నాళ్లూ చాలీ చాలని తిండి, అప్పులూ రోగాలూ తీరని కోరికల బాధ—అన్నీ నాతో పాటు అనుభ వించావు. పదిమందితో పేరంటానికి, సినిమాకు వెళ్లటానికి లేకుండా చేశాను గాదూ. పెళ్లయిన సంవత్సరంలో నువ్వడిగిన వెల్వెట్ జాకెట్టు సంగతి గూడా నా కింకా గుర్తున్నది. చాకిరీ, నిరాశా అనుభవించావ్. ఇక అనుభవించ నక్కర్లేదనుకొంటాను. చూడు అమ్మేదీ? అమ్మా!"

''చూడమ్మా నేను రేపట్నించీ యీ వుద్యోగం మాను కొంటున్నాను.''

అత్తా కోడళ్ల నోటినుంచి ఒకే సారిగా —

''ఖాయమైన ఉద్యోగం. ఎట్లా లేదన్నా రొండొంద లొస్తున్నై—'' అన్న భయాశ్చర్య మిశితమైన ఆందోళన అర్థ పూరితమైన మాటలుగా వెలువడింది.

''నిజమే. రొండొందల జీతం—పైన నెలకు యాభై రూపాయల అప్పు. అది సరే గాని, బాబాయి గారింటి పక్కనే వాటా ఒక్కటి ఖాళీగా వుంది. మీ రిద్దరూ పోయి చూసి ఖాయం చేసుకు రండి. నేను బొంబాయి పోతే మీకు పెద్ద తోడుగా బాబాయి వుంటాడు. అప్పులు తీసుకొని యిచ్చే స్వభావం కాదంటారా ఆయందీ పిన్నిదీ? పరవాలేదు.

మనవంటి వాళ్లేగా.''

అత్తా కోడళ్లకు కాళ్లూ చేతులు చల్లబడ్డవి. ఈ సన్నని యువకుడిలో ఏం పిశాచం ఆవేశించింది? బొంబాయి వెళ్తాడా? ఎక్కడది? మనభాషా? మనుషులా? తిండా? ఒక్కడే ఏమై పోదామని? జ్వరం వస్తే ఎవరు చూస్తారు? లారీలు, కార్లు, రైళ్ళు—అట్లా తిరుగుతుంటై గాబోలే?

''ఎందుకురా బొంబాయి వెళ్లేది? ఇక్కడ నీకేం తక్కువైందనిరా? తోటివాళ్లతోపాటు బతక లేమ్రా? టా కలో గంజో తాగి?''

''ఇప్పుడు తాగుతున్నది మాత్రం అంతకన్నా ఎక్కువేం గాదుగా అమ్మా. కలీ గంజీ ప్లస్ వ్యాపారస్థులు కలిపిన సన్నరాళ్ల మర బియ్యం. మన పేరు మధ్య తరగతి వాళ్ళట. తెల్ల చొక్కా పిరికివాళ్ల తరగతయింది. ఎవడు చూసినా యీ తరగతి వాణ్ణి మోసం చేసి, దబాయించి, టోపీవేసి, దోపిడీ చేసే వాళ్లే. రైల్వే పోర్టరు ఫస్టు క్లాసు ప్రయాణీకుడి వద్ద తన్నులు తిని, పావలా తీసుకపోతాడు. ఆ బరువుకే మనల్ని తిట్టి, తిమ్మి నాలి గింతలు ఎక్కువ కాజేస్తాడు. సినిమా కెళ్లితే చదువు సంధ్యల్లేని వెధవలు మన నెత్తిన కాళ్ళు బెడతారు. సిగరెట్ల దుమ్ము దులుపుతారు. మనం ఏమీ అనలేమని, పోలీసుల్దాకా వెళ్ల లేమనీ, వాళ్లకు లంచా లివ్వలేమనీ అందరికీ తెలుసు. ఇది డబ్బు లేకపోయినా వున్నట్టు నటించే వాడి జీవిత రహస్యం. ఇది నా కొద్దు. నేను బొంబాయి పోతున్నాను. నెలా రెండునెల్లదాకా మీకే యిబ్బంది లేకుండా అన్నీ యింట్లో పడేయించి, చిల్లరగా కొంత డబ్బిచ్చి పోతాను. ఆ తర్వాత అక్కణ్ణించి పంపుతాను.''

ఆ వారంలోనే అతను ఎవ్వరి మాటా వినకుండా బొంబాయి వెళ్ళిపోయాడు.

*　　*　　*

బొంబాయి వెళ్ళిన చాలా రోజులకు అంటే దాదాపు ఒక నెలకు ఉత్తరం గొలికి పారేశాడు. అందులో ఏమీ వ్రాయలేదు. కట్టె, గొట్టె,

తెచ్చే అన్నట్లుగా వుంది. డబ్బు పంపుతానని మాత్రం వ్రాశాడు. ఆ వ్రాయటం, వ్రాయటం మళ్ళీ మూడు నెల్లకు గాని వ్రాయలేదు. ఈ మాటు ఉత్తరంగాదు. ఇన్సూరెన్సు చేసిన కవర్లో డబ్బు వచ్చింది. "దేనికైనా సమర్థుడు" అనుకొన్నారు అత్తాకోడళ్ళు. అడపా దడపా వచ్చే ఉత్తరాల్లో విశేషాలు, వివరాలూ వుండవ్, డబ్బుకోసం చూడవద్దు మీకు కావలసినవన్నీ కొనుక్కోండి అని మాత్రం ప్రతి జాబులోనూ వ్రాస్తున్నాడు. డబ్బు పెత్తనం వచ్చింది గనుక అత్తా కోడళ్లకు మళ్ళీ కొరకొరలు ప్రారంభించాయ్. పెళ్ళయి అత్తగారింట్లో వుంటూ, పుట్టింటి ముద్దూ మురిపాలూ యీ మధ్య ఎప్పుడూ ఎరగని కూతుర్ని పిలిపించి బట్టలు పెట్టింది అత్తగారు. కోడలికి కన్నెర్రనయింది. కాని దూరాన వున్న అతగాడికి యివేమీ తెలియవుగా. ఈ మాటు ఉత్తరంలో తనసొంత కూతుర్ని పాత బడిలో మాన్పించేసి కాన్వెంటు స్కూలుకు ఎంత ఖర్చయినా సరే పంపించమని వ్రాశాడు. బాబాయికి, యిటువంటి పై పనులవల్ల యీ మధ్య మంచి కమిషన్ దొరుకుతున్నది. అత్తకు తెలీకుండా కోడలు కొన్న బంగారం బేరంలో యీ మధ్య సవరన్ కమీషన్ సునాయాసంగా సంపాదించాడు. బొంబాయి నుంచి వచ్చిన హుకుం ప్రకారం పెద్ద యింట్లోకి మారారు. ఈ ఇంట్లో ఎలెక్ట్రిక్ లైట్లూ అవీ వున్నాయి. రేడియో కొనేశారు. బొంబాయికి ఏ కొను గోళ్లోనో పెద్ద కమిషన్ కొట్టేయాలని చూసినప్పుడు వచ్చిన వాగ్వాదంలో అననే అనేశాడు. మధ్య వచ్చిన సిరి కాదుటమ్మా అని. ఎవరి రహస్యపు కొనుగోళ్ళు వాళ్ల కున్నవిగాబట్టి అత్తా కోడళ్ళిద్దరూ ఆ మాటను భరించి వూరుకొన్నారు. ఇవన్నీ ఒక్క ఎత్తు.

అందర్నీ కలవరపరిచింది. ఆ తర్వాత వచ్చిన తంతి - బాబాయికి యింగ్లీషురాక యింకెవరిచేతనో చదివించుకొన్నాడు. "ఏవమ్మా మన రాముడేదో కేసులో యిరుక్కున్నట్టుగా వుందే. ఎంత డబ్బుంటే అంతా పంపించమని వైర్లెస్ కొట్టాడు." అత్తా కోడళ్ళు లబోదిబో

అన్నారు. పెట్టెల సందుల్నించి, వంటింటి బూజుగూళ్ళనుంచి విలువ గల వస్తువులన్నీ తెగ నమ్మారు. బాబాయిని నమ్మక, పెద్ద కుటుంబీకు లయిన తర్వాత తెలిసిన ప్లీడరుగారి ద్వారా తంతి మనియార్డర్లు చేయించారు. మరిచి పోయినవి అశ్రద్ధ చేసినవీ ముడుపులన్నీ చెల్లించారు. సాయిభాబాకు కొత్తగా వెలిసిన క్రైస్తవ సన్యాసమ్మకు అందరికీ మొక్కుకున్నారు. ఎట్లా అయితేనేం "రాముడు" విడుదలయినట్లు విని, చదువుకొని ఆనందించారు. గుండెలమీద చేతులు వేసుకోకుండా నిద్ర పోయారు. రాముడు బొంబాయి పోయి రెండేళ్లు కావస్తున్నది. చివరకు "ఇవ్వాళో రేపో బయలుదేరి వస్తున్నాను" అని ఉత్తరం వచ్చింది. ఉత్తరం వచ్చిన రోజునే అతను పెద్ద కార్లో బోలెడు సరంజామాతో దిగాడు.

"యివ్వాళే ఎట్లా వచ్చా నాన్నా, ఉత్తరం పొద్దునేగా వచ్చింది" అని యీ రెండేళ్ళలో గుర్తు పట్టలేనంతగా పెరిగిన కూతురు అడిగింది.

"విమానంలో"

"నా మీద ఒట్టురా. నువ్వు విమానాల్లో గిమానాల్లో పోనూ వద్దూ. రానూ వద్దూ - నాయనా" అని తల్లి గడ్డం పట్టుకొంది.

"ఏ వమ్మా - వంటమనిషిని పెట్టుకోలేదు?" అన్నది అతడి మొదటి ప్రశ్న.

"ఏమిరా నేను చచ్చిపోయానా?"

"అదిగాదే మన హోదాకు తగదు" అన్నాడు కొడుకు.

కోడలు మొగుడు తెచ్చిన కొత్త చీరెల్ని పొరుగమ్మలికి చూపింది. కాని భార్యతో మాట్లాడేందుకు అతనికి కొన్ని నిముషాల కంటే తీరిక చిక్కలేదు.

వచ్చిన రోజునుంచీ, పట్నం అనీ, హైదరాబాదనీ ఎక్కడి కెక్కడికో వెళ్ళి వస్తున్నాడు. కారుకోసం యింకో యింట్లోకి మారాలి సొచ్చింది. వంట మనిషి వచ్చింది. తల్లీ, భార్యా అతని మీద ఆ నాటి

కేసేమిటో అడుగుదామని పది వందల సార్లు ప్రస్తావించబోయారు. కాని రాముడికి తీరికే చిక్కటం లేదు. వివరంగా చెప్పటానికి "ఇన్కం టాక్సు కేసులు" మీకేం తెలుస్తయ్యే అనేసేవాడు. నిజంగా వాళ్ళకేం తెలీవు. ఇంట్లో ఎవరికీ క్షణం తీరిక వుంటంలేదు. కొంచెం తీరిక చేసుకు కూర్చుంటే వంట మనిషి యింట్లో పదార్థాలు వ్యర్థం చేస్తుంది. పని మనిషి దాటేస్తుంది. బాబాయి దొంగ కబుర్లలో పడిపోయి మోసపోకుండా వుంటానికి అసలు నిద్రే పోగూడదు. ఇవన్నీ రాముడు తెచ్చిన తిప్పలో, బాధ్యతలో, తెలివో, గొప్పో, ముప్పో అత్తా కోడళ్ళకు తెలియలేదు. అయితేనేం యింట్లో ఎవరేదడిగినా అది వెంటనే శాంక్షన్. కాని ఆ వస్తువు తీసుకు రావటానికీ మాత్రం అతనికి తీరికుండదు. డబ్బు పడేస్తాడు, పోతాడు.

తల్లి తీర్థ యాత్రలకు వెళ్లాలని పునిస్త్రీగా వుండగా తలచుకొన్న కోరికలను యీ నాటికి కొడుకు నడిగింది. అతను ఖచ్చితంగా చెప్పాడు. "నాకు తీరిక లేదమ్మా వంట మనిషిని తీసుకొని మొదటి క్లాసులో వెళ్లు."

"నాకేం కర్మరా, చెట్టంత కొడుకును పెట్టుకొని పరాయి వాళ్ళను నమ్ముకోటం."

"ఏదీ? తీరికేదీ?"

"సంపాయించావ్ గదా యింకా ఎందుకురా అంత దుగ్ధ. విశ్రాంతి లేకపోతే జీవితం ఏమైపోతుంది?"

"నీకు తెలీదు లే అమ్మా. కూచుని తింటే కొండలు గూడా కరిగిపోతై. పన్నులు తెగ మింగేస్తున్నాయ్. బిజినెస్ అంతా స్వయంగా చూచుకోవాలి. ఎవర్ని నమ్మినా గోతీలో తోసేస్తారు."

ఎన్నో సంవత్సరాల క్రితం తన భర్త అన్న మాటలు ఆ ధోరణి ఆమెకు జ్ఞాపకం వచ్చాయి. ఆ మాటలు విన్న కొద్ది రోజుల్లోనే ఆయన సంపాదించిన ఆస్తంతా కరిగిపోయింది. ఆమె వళ్ళు జలదరించింది. కొడుకును ఆందోళనతో భవిష్యత్తును గూర్చిన భయంతో

చూసి కంపించి పోయింది.

ఈ అయిదారు సంవత్సరాలలోనూ సుందరికి యింకో యిద్దరు పిల్లలు పుట్టారు. కాని అప్పటికన్నా భర్త యింకా ఏమీ సన్నిహితుడవ లేదు. ఎప్పుడూ హడావిడీ ఆలోచనా, అలసటలతో వస్తాడు. పోతాడు. సుందరికి వళ్ళు వచ్చింది. బోలెడన్ని సొమ్ము లొచ్చినై. ఆ తర్వాత అల్లుడూ వచ్చాడు. పెద్ద కూతురికి బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేసి పెళ్ళి చేశారు. ఆ పెళ్ళికి ఎంత ఖర్చయిందో ఎవరికీ తెలీదు. సంవత్సరంలోపల అల్లుడూ, కూతురూ వచ్చినప్పుడు గూడా "రాముడికి" తీరిక చిక్కలేదు. అల్లుడి మర్యాదలన్నీ సుందరమ్మ స్వయంగా చూడవలసి వచ్చింది.

ఆ మరుసటి సంవత్సరమే "రాముడు" ఐ. పి. పెట్టాడని వదంతి బయలుదేరింది. తల్లీ, భార్యా అతన్నేమీ అడగటానికి గూడా భయ పడ్డారు. ఏమయితేనేం యింటిముందు నిలబడ్తున్న కార్లు, పెద్ద పెద్ద తలగుడ్డల్తో వస్తున్న చెట్టియార్లూ, మార్వాడీలూ, అంతకన్నా పెద్ద కళ్ళజోళ్ళతో వస్తున్న ప్లీడర్లూ – యీ సంచలనమంతా కూలిపోతున్న "రాముడి" సామ్రాజ్యానికి చివరి మిత్రులుగా కన్పించారు ముసలి తల్లికి. సుందరికి ఏడుపూరాలేదు. దుఃఖం రాలేదు. భయంతో ఆ రెండూ యింకిపోయాయ్. ఊరంతా ఐపీ అంటే ఐపీ అన్నారు. ఎటు చూసినా అప్పుల వాళ్ళేనని బాబాయి కళ్ళు బోయినా ధైర్యంగా చెప్పాడు.

ఏమైతేనేం "రాముడు" కొద్ది రోజుల్లోనే ఎక్కడి వక్కడ సర్దే శాడు. కారుపోయింది. బ్యాంకు బుక్కుతో పాటు పని మనుషులూ, పెద్ద ఇల్లూ వంట మనిషి ఎక్కడి వాళ్ళక్కడ మాయమైనారు. దేవా లయం వీధిలో పాత యింటికి మకాం మార్చేశాడు. బస్తీ చాలా పెరిగింది. పెద్ద పట్నం అయింది. నిజానికి, ఏమూల ఒదిగినా ఎవరికీ తెలీకుండా బతకవచ్చు. అందువల్ల పూలమ్మిన వూళ్ళో కట్టెలమ్మట

మని వాళ్ళ కెవరికీ తోచటం లేదు.

ఆ యింట్లో అందరికీ భయం ఒక్కసారే వదిలి పోయింది. పిల్లలు తప్పితే నవ్వని యింట్లో ఇప్పుడందరూ నవ్వుతున్నారు.

"నాయనా! నన్ను దేవాలయానికి తీసుకు పోతావా?" అని తల్లి అడిగింది.

"వెళ్దాం పదమ్మా" పూదువత్తులు, కర్పూరం, తమలపాకులు స్వయంగా కొనుక్కుని తెచ్చి తల్లిని శివాలయం తీసి కెళ్ళాడు. వచ్చే టప్పుడు విచ్చిన మల్లె పూలు వెన్నెల్లో బేరంచేసి తెచ్చి భార్యకిచ్చాడు.

"ఏమండీ ముసలి వాళ్ళమైనాకన్నా యీ ముచ్చట్లు?" అని సుందరమ్మ అన్నది.

"అప్పుడే ముసలితనమా? మన జీవితం యిప్పుడే మొదలయింది" అన్నాడతను.

చిన్న పిల్లకు ఎక్కాలు రాలేదని ఒళ్లో కూచో పెట్టుకొని శ్రద్ధగా వల్లెవేయించటానికి గూడా తీరిక చిక్కిందతనికి.

ఒక రోజున వంటింటి గడపమీద కూర్చుని తల్లికి కరివేపాకు దూసి యిస్తున్నాడు.

"నాయనా" అన్నది.

"ఏమిటమ్మా?"

"మన జీవితంలో యిన్నేళ్ళకురా తృప్తిగా భోం చేస్తున్నాం."

"అవునమ్మా. నాకూ యిప్పుడు తృప్తిగా వుంది" అని "రాముడు" సిగ్గు పడుతూ తనలో తాను తల్లికి నమస్కరించాడు. ○

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక,
13-11-1957